క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న సిర్ర దేవేందర్

ఎదులాపురం: జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో జిల్లా నుంచి పాల్గొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు యూసుఫ్, బాలరాజుల సమక్షంలో ఇది వరకు జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం చేసిన ఉద్యమాలు, భవిష్యత్‌లో చేయనున్న పోరాటాలను వివరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ సుశీల్ బడ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో దివాళి విత్‌మై భారత్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పర్యావరణం, కాలుష్యంపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను విద్యార్థులు, నెహ్రూ యువకేంద్రం సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, ఎన్‌సీసీ కేర్‌టేకర్ చంద్రకాంత్, పీవో పృథ్వీరాజ్, యాఖుబ్ అలీ, లెక్చరర్లు నరేశ్, ఎన్‌సీసీ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. గిరిజన పోషణ మిత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం గిరిజన ఆశ్రమోన్నత బాలికల వసతి గృహంతో పాటు కుటాల(కె)లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మొత్తం 93 మంది విద్యార్థినుల రక్త నమూనాలు వైద్య సిబ్బంది సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనం ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, నరేందర్ రెడ్డి, ఏఎన్‌ఎం జ్యోతి, సౌందర్య, ప్రధానోపాధ్యాయుడు అంబారావు, హాస్టల్ ఏఎన్‌ఎం అశ్విని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసికి చోటు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రాష్ట్ర పాల్‌కు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. ఈనెల 27న హైదరాబాదులో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నిర్వహించిన ఎన్నికల్లో సభ్యునిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కడం పట్ల జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావులు సోమవారం శాలువాతో సన్మానించారు.

29, 30న సర్టిఫికెట్ల పరిశీలన లేదు

ఆదిలాబాద్‌టౌన్: డీఎస్సీ 2024 స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ 1:3లో జిల్లాకు చెందిన అభ్యర్థులకు గతంలోనే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి ప్రణీత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో సంబంధిత అభ్యర్థులు 29, 30 తేదీల్లో డీఈవో కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో డ్రాఫ్ట్ మెనిసివిల్ శిక్షణ అందించేందుకు సహాయ శిక్షణ అధికారి (ఏటీవో) 11 నెలలకు తాత్కాలిక నియామకం కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు, ఆసక్తి గల వారు ఈనెల 31 వరకు విద్యార్హత సర్టిఫికెట్లతో రిజిస్టర్ పోస్టులో సమర్పించాలన్నారు. డెమో క్లాస్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు కోసం 94914 60060 సంప్రదించాలని కోరారు.

సెల్‌ఫోన్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన రాహుల్ జంబాడే రెండు నెలల క్రితం ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో ఆయన సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశాడు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఫోన్ ఉన్నట్లు గురించిన టూటౌన్ పోలీసులు అక్కడి నుంచి రికవరీ చేశారు. సోమవారం టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు బాధితుడికి ఫోన్‌ను అందజేశారు. పోలీసు సిబ్బంది సంజీవ్, రమేశ్, నరేందర్‌లు పాల్గొన్నారు.

దండారీ సందడి..

ఆదివాసీ గ్రామాల్లో దండారీ సందడి మొదలైంది. సోమవారం జైనథ్ మండలంలోని బెల్లూరిగూడలో, ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు గిరిజన గ్రామాల్లో, నార్నూర్ మండలంలోని మాన్కాపూర్, గంగాపూర్, గొందుగూడలో, ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్‌లో దండారీ ఉత్సవాలు నిర్వహించారు. ఎత్మసూర్ దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. గుస్సాడీలు ప్రత్యేకంగా తయారు చేసిన టోపీలు ధరించి చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి దండారీ బృందం వచ్చి అతిథ్యం స్వీకరిస్తారు. గుస్సాడీలతో పాటు గ్రామస్తులు సంప్రదాయ నృత్యం చేశారు.

– ఆదిలాబాద్‌టౌన్/ఇంద్రవెల్లి/నార్నూర్/ ఇచ్చోడ



ఇచ్చోడ: ఎత్మాసార్ దేవుతలకు పూజలు చేస్తున్న నాయకులు



నార్నూర్: భోగి పూజ చేస్తున్న ఆదివాసీ గిరిజనులు



ఇంద్రవెల్లి: పాటగూడలో..

సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



గుస్సాడీలతో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఖానాపూర్ వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏత్మసూర్ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుస్సాడీలు, దండారీ బృందంతో కలిసి నృత్యం చేశారు. దండారీ ఉత్సవాల్లో భాగంగా ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామాలకు అతిథులుగా వెళ్లడం ద్వారా గ్రామాల మధ్య, స్నేహభావం, ఐక్యత పెరుగుతుందననారు. అనంతరం హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజిత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ రచించిన కడెం నది ప్రయాణం.. ఇది ఆదివాసీ భగీరథుడి ప్రయత్నం అనే పుస్తకాన్ని ఆదివాసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, ఆదివాసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు గొప్పవి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని టక్కుగూడ గ్రామంలో దండారీ ఉత్సవాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. ముందుగా ఏత్మాసూర్ దేవతలకు పూజలు చేశారు. అనంతరం గుస్సాడీలో కలిసి నృత్యం చేశారు. తరతరాలుగా ఆదివాసీలు ప్రతీ ఏటా దండారీ ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం దండారీ ఉత్సవాల నిర్వాహణకు రూ. 15 వేలు అందచేస్తుందన్నారు.

దండారీ ఉత్సవాలకు నిధుల కేటాయింపు

ఉట్నూర్‌రూరల్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ పరిధిలోని ప్రతీ దండారీకి రూ. 15 వేల చొప్పున కేటాయించడం జరిగిందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో ఐటీడీఏ పరిధిలోని వేయి గ్రామాలలో ఒకొక్క దండారికి రూ. 15 వేల చొప్పున ప్రభుత్వం రూ. 1 కోటి 50 లక్షలు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఆత్మీయ సన్మానం

- ఘనంగా వీడ్కోలు పలికిన అధికారులు, ఉద్యోగులు

కైలాస్‌నగర్: నిర్మల్ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్‌కు సోమవారం మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పలువురు కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు, వివిధ పార్టీల నాయకులు కమిషనర్‌ను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు పలికారు. ముఖ్యంగా కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక శ్రద్ధతో ఎప్పటికప్పుడు చెల్లించి వారికి అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్వో జాదవ్ కృష్ణ, డీఈ తిరుపతి, టీపీవో సుమలత, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, మెప్మా టీఎంసీ భాగ్యలక్ష్మి, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



కమిషనర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సోమవారం పాల్గొన్నారు. వార్ధా అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పంకజ్ బోయర్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మహారాష్ట్రలో డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఎంతగానో పాటుపడిందని పేర్కొన్నారు. కార్యకర్తలు అందరూ సమిష్టిగా గెలుపు కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘మోదీ పాలనలోనే దేశాభివృద్ధి’

ఇంద్రవెల్లి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకులు రితేష్ రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సభ్యత్వ నమోదు స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచంలోనే భారతదేశాన్ని అగ్రగామి దేశంగా చేయాలనే లక్ష్యంతో అన్ని దేశాలతో సంబంధాలు ఏర్పర్చుకొని, అభివృద్ధికి బాటలు వేస్తున్నారని కొనియాడారు. ప్రతిఒక్కరూ దేశం కోసం ధర్మం కోసం బీజేపీలో సభ్యత్వం నమోదు చేసి పార్టీని బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, కనక తుకారం, మరప రాజు, ఆర్క ఖమ్ము, దిలీప్ మోరే, కనక హనుమంత్‌రావ్, మస్కే రాజువర్ధన్, మెస్రం జైరాం పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న నాయకులు

పోడు పట్టాలకు బ్యాంక్ రుణాలు అందించాలి



పట్టాలను చూపుతున్న గిరిజన రైతులు

తాంసి: గత ప్రభుత్వం అందజేసిన ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు సాగు కోసం అధికారులు బ్యాంక్ రుణాలు అందించేలా చూడాలని భీంపూర్ మండల గిరిజనులు కోరారు. సోమవారం అర్లి(టి) గ్రామానికి చెందిన గిరిజన రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్య విన్నవించేందుకు వచ్చారు. కాగా సోమవారం ప్రజావాణి లేక పోవడంతో అధికారులను కలిసే అవకాశం లేక వెనుదిరిగారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్యాంక్ ద్వారా రుణాలు అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

నేరడిగొండ: పీఆర్సీ, నాలుగు డీఏలతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీయూఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉత్తంరావు, జ్యోతిరాంలు మాట్లాడుతూ బకాయి పడ్డ నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఈ–కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడదల చేయడంతో పాటు పీఆర్సీ కమిటీ రిపోర్ట్ తెప్పించుకొని అమలు చేయాలని పేర్కొన్నారు. తమ సమస్యలను నవంబర్ 22లోగా పరిష్కరించాలని, లేనియెడల నవంబర్ 5న ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా, 23న హైదరాబాద్‌లో ధర్మాగ్రహదీక్ష చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సంఘం సభ్యులు మధుకర్, రాజునాయక్, బాబుసింగ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేశీదారు పట్టివేత



పట్టుబడిన దేశీదారు బాటిళ్లు

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద సోమవారం దేశీదారు బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుబ్రాలతండా గ్రామానికి చెందిన చౌహన్ సంజన్, సోలంకి లఖన్‌లు మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి బైక్‌పై దేశీదారును తీసుకువస్తుండగా ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద 17.1 లీటర్ల 190 బాటిళ్లు(ఒక్కోటి 90ఎంఎల్) పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ. 6,650 ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెరటికోళ్ల పెంపకంతో ఆర్థికంగా ఎదగాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పెరటికోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ ఏపీఎం భగవాండ్లు అన్నారు. సోమవారం జైనథ్ మండల కేంద్రంలో మహిళ స్త్రీశక్తి కార్యక్రమంలో భాగంగా పెరటికోళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మండలంలోని 60 మహిళ సంఘాల సభ్యులకు ఒక్కొక్క కోడిపిల్లకు రూ.100 చొప్పున 20 కోడి పిల్లలను అందించడం జరిగిందన్నారు. ఇంటి వద్దనే కోళ్లను పెంపకం చేసి లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు గంగారాం, వెంకట్ రెడ్డి, వాసురెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పెరటికోళ్లను అందజేస్తున్న ఏపీఎం భగవాండ్లు

కుల సంఘాల అభివృద్ధికి కృషి

నేరడిగొండ: అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని తేజపూర్ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.4 లక్షలతో బీసీ సంఘం ప్రహరీ నిర్మాణానికి బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్‌చార్జి మంత్రి సీతక్క చొరవతో రానున్న రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేయించి నియోజకవర్గానికి తీసుకొస్తానన్నారు. బీసీ సంఘ సభ్యులు అడిగిన వెంటనే నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేసిన ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంత్ రావు, అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డి, కురుమే మహేందర్, బద్దం పోతారెడ్డి, ముత్యాల పోతన్న, తీగల విలాస్, గాండ్ల గంగాధర్, మౌలానా, గడ్డం సురేందర్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఆడే గజేందర్

గిట్టుబాటు ధర అందించాలి

ఎదులాపురం: పత్తి రైతులకు గిట్టుబాటు ధర అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. కొనుగోలులో స్పష్టత లేకపోయినప్పటికీ ఆర్భాటంగా పత్తి కొనుగోలు ప్రారంభించారని అన్నారు. మద్దతు ధరను సైతం అందించకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పత్తికి గిట్టుబాటు ధరను అందించి రైతులకు ఆదుకోవాలన్నారు. సీపీఐ నాయకులు కుంటాల రాములు, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

తాంసి: మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు పబ్లిక్ టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తాంసి గ్రామ యువకులు అధికారులకు విన్నవించారు. బ్యాంక్‌తో పాటు మండల కార్యాలయాలకు పనుల కోసం వచ్చే వారికి పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని కోరుతూ.. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా మూత్రశాలల నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యువకులు రాము, లింగన్న, రాము యాదవ్, అశోక్, సృజన్, గుంజరి కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో కేసుల పరిష్కారం

ఆదిలాబాద్‌టౌన్: న్యాయమూర్తులు, న్యాయవాదుల సమన్వయంతోనే కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని జూనియర్ సివిల్ జడ్జి, జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హుస్సేన్ నాయక్ అన్నారు. ఇదివరకు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా పనిచేసిన మంజుల సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వెళ్లగా, ఆ స్థానంలో బోథ్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని, చిన్న చిన్న విషయాలను పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేశ్, ఎంబడి సంతోష్, న్యాయవాదులు రవీందర్, చందు సింగ్, అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్, సుధీర్, గంగారాం, మోహన్ సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

స్కాలర్‌షిప్ సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఇచ్చే వివిధ రకాల స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదవులు చదవాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. సోమవారం కళాశాలలో స్కాలర్‌షిప్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆర్థిక భారం లేకుండా విద్యార్థులు తమ విద్యాలక్ష్యాలను సాధించడంలో స్కాలర్‌షిప్ ఎంతగానో దోహద పడుతుందన్నారు. సూపరింటెండెంట్ కరుణాకర్, స్కాలర్‌షిప్ కోఆర్డినేటర్ కోటయ్య, స్కాలర్‌షిప్ ఇన్‌చార్జి నరేశ్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఘు, లెక్చరర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం

నేరడిగొండ: స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఆయన్నగారి భూమయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. అన్ని సామాజిక వర్గాలకు సభ్యత్వాలు కల్పించాలని సూచించారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో 250 సభ్యత్వాలే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. నాయకులు గుమ్మడి భీంరెడ్డి, సాబ్లే సంతోష్ సింగ్, ఆకుల రాజశేఖర్, నర్సయ్య, వెంకటేశ్, తీగల నవీన్, కొప్పుల గంగారెడ్డి, బాత్రే శేఖర్, శ్రీధర్ రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆయన్నగారి భూమయ్య

నిజాయతీ చాటుకున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు నిజాయతీ చాటుకున్నారు. పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన సమీఉద్దీన్ సుల్తాన్‌కు సంబంధించి రూ.50వేల విలువ గల ఫోన్ సోమవారం పడిపోయింది. రవీంద్రనగర్ వైపు వెళ్తున్న విద్యార్థులు నవాబ్ అహ్మద్, నవాసొద్దీన్‌లకు దొరకడంతో వారు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి సీఐ సునీల్ కుమార్‌కు అప్పగించారు. బాధితుడిని పిలిపించి విద్యార్థుల సమక్షంలోనే ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులతో పాటు సమీఉద్దీన్ సుల్తాన్ వారిని అభినందించారు.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

కైలాస్‌నగర్: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సన్మానించేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యేను వారించిన చైర్మన్ తిరిగి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కాసేపు సమావేశ మందిరంలో బైఠాయించి ప్రజాభిప్రాయ సేకరణను పరిశీలించిన అనంతరం వెనుదిరిగారు.

42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న గజేందర్ యాదవ్

ఎదులాపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ సమగ్ర కుల గణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆప్క గజేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. బీసీ కుల గణన చేపట్టి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా సమితి ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గట్టు నారాయణ, ఉపాధ్యక్షుడిగా మందుల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఆడెపు శ్రీనివాస్, కార్యదర్శిగా దాసోజు కిరణ్, సభ్యులుగా లక్ష్మణ్‌చారి, రమేశ్, రాజు, ఉత్తమ్, శంకర్, శ్రీనివాస్, దోని జ్యోతి, ప్రధాన కార్యదర్శి పద్మలను ఎన్నుకున్నట్లు తెలిపారు.